

ఎక్సైజ్ శాఖకు కిక్కు..

ప్రస్తుతం ఎక్సైజ్ స్టేషన్ల వారీగా దరఖాస్తులు	
జగిత్యాల	902
ధర్మపురి	432
మెట్‌పల్లి	500
మొత్తం	1,834
వచ్చిన ఆదాయం	రూ.55.02 కోట్లు





జగిత్యాలలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

- ఇప్పటి వరకు 71 మద్యం షాపులకు 1,834 దరఖాస్తులు
- గతంతో పోలిస్తే పెరిగిన ఆదాయం, తగ్గిన దరఖాస్తులు
- ఈనెల 23 వరకు టెండర్ల గడువు పొడిగింపు

జగిత్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణాలకు ఎక్సైజ్ టెండర్ల ప్రక్రియ ఆసక్తికరంగా మారింది. గతంతో పోలిస్తే దరఖాస్తులు తగ్గినప్పటికీ ఆదాయం మాత్రం పెరిగింది. జిల్లాలో ఈనెల 18వ తేదీ వరకు 2025-27కు సంబంధించి దరఖాస్తులను స్వీకరించారు. 2023-25 మద్యం పాలసీతో పోల్చితే ఈసారి దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. అయినప్పటికీ ప్రభుత్వ ఆదాయానికి గండి పడలేదు. గతంతో పోల్చితే సుమారు రూ.3కోట్ల ఆదాయం ఎక్కువగా వచ్చింది. గతంలో దర ఖాస్తు ఫీజు రూ.2లక్షలు ఉండగా ఈసారి రూ.3 లక్షలకు పెంచారు. దీంతో టెండర్‌దారులు అంతగా ఆసక్తి కనబరచ లేదు. జిల్లా కేంద్రంలోని ఎస్సారెస్పీ క్యాంపులో గల ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించారు. ముం దుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 18వ తేదీ వరకు తుది గడువుగా ఉంది. శనివారం రాత్రి వరకు టెం డర్ల ప్రక్రియ కొనసాగింది. రాష్ట్ర స్థాయిలో ఆశించిన స్థాయి లో దరఖాస్తులు రాకపోవడంతో టెంటర్ల గడువును ఈనెల 23వ తేదీ వరకు పొడిగించారు.

● ఇప్పటి వరకు రూ.55.02 కోట్ల ఆదాయం

మద్యం షాపులకు గతంతో పోల్చితే దరఖాస్తులు తగ్గిన ప్పటికీ ప్రభుత్వ ఆదాయంలో మాత్రం అంతగా మార్పేమీ రాలేదు. జిల్లాలో 71 షాపులకు గానూ 2023 సంవత్సరంలో 2,636 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.52 కోట్ల ఆదాయం సమకూరింది. అయితే ఈసారి దర ఖాస్తు ఫీజు రూ.3లక్షలకు పెంచింది. దీంతో దరఖా స్తులు తక్కువగా నమోదైనట్లు తెలుస్తోంది. శనివారం రాత్రివరకు జిల్లా వ్యాప్తంగా 1,834 దరఖాస్తులు వచ్చాయి. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.55.02కోట్ల ఆదాయం లభించింది. గతంతో పోల్చితే సుమారు రూ.3.02 కోట్ల ఆదాయం అదనంగా వచ్చింది. కాగా, మూడు, నాలుగు రోజుల క్రితం వరకు వందలోపు మాత్రమే దరఖాస్తులు వచ్చాయి. ఎక్సైజ్ అధి కారులు వ్యాపారులను ప్రోత్సహించడంతో టెండర్లు పుంజు కున్నాయి. ఒక షాపునకు పది కంటే తక్కువ దరఖాస్తులు ఉంటే వాటికి రీ టెండర్ నిర్వహించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

● అత్యధికంగా వెల్గటూరులో 60 దరఖాస్తులు..

జిల్లాలో మద్యం దుకాణాలకు నిర్వహించిన టెండర్లలో ఇప్పటి వరకు అత్యధికంగా వెల్గటూరు షాపునకు దరఖా స్తులు వచ్చాయి. వెల్గటూరులో.. - మిగతా 8లో

దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు
-సత్యనారాయణ, ఎక్సైజ్ సూపరింటెండెంట్



జిల్లా వ్యాప్తంగా గల మద్యం దుకాణాలకు టెండరు దరఖాస్తుల స్వీకరణ గడువును ప్రభుత్వం ఈనెల 23వ తేదీ వరకు పొడిగించింది. మద్యం దుకాణాల కేటాయింపు కోసం డ్రాను ఈనెల 27న కలెక్టర్ సత్యప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నాం. ఆసక్తిగల వ్యక్తులు మద్యం దుకాణా లను దక్కించుకోవడానికి దరఖాస్తులు సమర్పించాలి.

ఆనందాల కేళి.. వెలుగుల దీపావళి



- నేడు నరక చతుర్దశి
- చెడుపై మంచి గెలుపునకు చిహ్నంగా సంబరాలు
- జిల్లా వ్యాప్తంగా కోలాహలం

జగిత్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి అంటే వెలుగుల పండుగ..దీప కాంతులతో ఇంటిని అలంకరించి అందరూ ఆనందంగా జరుపుకునే శుభదినం. జిల్లా వ్యాప్తంగా సోమవారం నరకచతుర్దశి (దీపావళి)ని వైభ వంగా జరుపుకోనున్నారు. దీప కాంతులతో ఇంటిని అలం కరించి చిన్నాపెద్ద తేడా లేకుండా పండుగను ఆనందో త్సాహాలతో జరుపుకుంటారు. స్వాతి నక్షత్రంతో కలిసిన అమావాస్య నాడు దీపావళి జరుపుకోవాలని శాస్త్రం చెబు తుంది. దీపావళి రోజు తప్పనిసరిగా మహాలక్ష్మీపూజ చేస్తారు. వేయి పడగలపై భూభారాన్ని మోసే ఆది శేషు డు తన పడగల్ని మార్చుకునే ఘట్టంలో భూమిపై ఏర్పడే మార్పులకు సంకేతంగా నరక చతుర్దశిని వర్ణి స్తారు. ఈ రోజు సూర్యోదయానికి పూర్వమే పవిత్ర స్నానాన్ని ఆచరిస్తే శరీరానికి దివ్య శక్తి కలుగుతుం దంటారు. జిల్లాలో దీపావళి వేడుకలను అట్టహాసంగా నిర్వహించుకోనున్నారు.

ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలి
- సత్యప్రసాద్, కలెక్టర్

ప్రతి దీపం..ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయ కాంతులు నింపాలి. చీకట్లను తొలగించి ప్రజల జీవి తాల్లో దీపావళి పండుగ వెలుగులు నింపాలని కోరు కుంటున్నా. జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు.

సంస్కృతిని మరవకూడదు
- అశోక్ కుమార్, ఎస్పీ

సంస్కృతి సంప్రదాయాలను మరవకుండా వేడుక లను సమైక్యంగా నిర్వహించుకోవాలి. దీపకాం తుల నడుమ అమ్మవారిని ఆచరిస్తే అనుగ్రహం అపారం గా ఉంటుంది. జిల్లా ప్రజలకు పోలీసు శాఖ పక్షాన శుభాకాంక్షలు.

కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి
● జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్

కొడిమ్యాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన సౌకర్యాలను నిర్వాహకులు కల్పించాలని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో కొడిమ్యాల, పూడూర్, తిర్మాలాపూర్ సింగిల్ విండోల పరిధిలోగల వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై డీసీవో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలను పాటిస్తూ నిర్వాహకులు కొనుగోళ్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ మల్లేశం, కొడిమ్యాల, మండలంలోని పూడూర్, తిర్మాలాపూర్ సింగిల్ విండోల కార్యదర్శులు వి.గంగాధర్, ఎ.రాజేందర్‌రెడ్డి, కుర్షీద్‌అహ్మద్, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

డీసీసీ ఎన్నికపై ప్రజాభిప్రాయ సేకరణ

● ఇప్పటికే జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గాల్లో పూర్తి

జగిత్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి ఎన్నికకు సంబంధించి పార్టీ నాయకత్వం చేపట్టిన వడ పోత కార్యక్రమం జిల్లాలో రోజురోజుకూ ఆస క్తిని మరింత పెంచుతోంది. ఎస్సీ, ఎస్టీ, మై నార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రాతినిత్యం వహిస్తున్న జిల్లా కావ డం, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ల మధ్య నెలకొన్న ప్రత్యేక రాజకీయ వాతావరణంతో ఉత్కం ఠను కలిగిస్తోంది. ఈ సీటును బీసీకి అప్ప గిస్తారా.. ఓసీకి కేటాయిస్తారా అనే విషయం లో కచ్చితమైన నిర్ణయానికి రాక పోయి నప్పటికీ ఏఐసీసీ పరిశీలకుడు, తమిళ నాడు మాజీ ఎంపీ డాక్టర్ జయకుమార్, పీసీసీ పరిశీలకుడు కేతూరి వెంకటేశ్ ప్రతి అంశాన్ని కూలంక శంగా పరిశీలిస్తున్నారు.



అభిప్రాయ సేకరణ జరుపుతున్న ఏఐసీసీ పరిశీలకులు జయకుమార్, కేతూరి వెంకటేశ్

డీసీసీ పీఠం కోసం పోటీలో ఉన్నవారితో ఇప్పటికే ఈనెల 17వ తేదీన ముఖాముఖి నిర్వహించారు. తాజా గా గత రెండు రోజులుగా జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో పర్యటిస్తూ ఒకవైపు కాంగ్రెస్ కార్యకర్తలు, నేతల అభిప్రాయాలను, మరోవైపు సాధారణ జనం అభిప్రాయాలను సైతం సేకరిస్తు న్నారు. జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజక వర్గాలతో పాటు వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల పరిధిలోని పలువురు ఆశావహులతో ఏఐసీసీ పరిశీలకుడు డాక్టర్ జయకుమార్, టీపీసీసీ పరిశీలకుడు కేతూరి వెంకటేశ్ ముఖా ముఖిగా మాట్లాడారు. దీనికి తోడు జిల్లా లోని పలు పట్టణాలు, గ్రామాల్లో పర్యటి స్తూ సాధారణ జనం నుంచి సైతం అభిప్రాయాలను సేకరిస్తుండడం ప్రాధా న్యం సంతరించుకుంది. రాజ కీయంగా వేడిని పుట్టించే జగిత్యాల నియోజకవర్గం తో పాటు ధర్మపురి, కోరుట్ల నియోజక వర్గాల్లో అభిప్రాయ సేకరణ, సమావేశాలు నిర్వహిస్తుండడం చర్చనీ యాంశంగా మారింది. జిల్లా కేంద్రంలోని మెడికల్ కళా శాల గెస్ట్ హౌజ్‌లో గత రెండు రోజులుగా పలువురు ఆశావహులు, కార్యకర్తలతో ముఖాముఖీ నిర్వహిస్తూ అభిప్రాయాల ను సేకరించారు. క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ కిరాణదుకా ణదారులు, కిల్లీ కొట్టు నిర్వాహకులు, మెడికల్ దుకా ణం, రేషన్ దుకాణం ఇలా పలువురు వ్యాపార వర్గాలను కలుస్తుండడంతో పాటు పల కార్మిక వర్గాలను కలిసి అభిప్రాయాలను స్వీకరి స్తుండడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.





మృతుల కుటుంబసభ్యులకు మంత్రి అడ్లూరి పరామర్శ


ధర్మపురి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని బ్రాహ్మణవాడకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి రొట్టె బాలకిష్టయ్య అనారోగ్యంతో ఇటీవల మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. ఈ సందర్భంగా బాలకిష్టయ్య మృతి వివరాలను కుటుంబ సభ్యులను అడిగి ఆయన తెలుసుకున్నారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన శాతాల్ల నారాయణ అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. ఆయన వెంట ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, ఏఎంసీ పాలకవర్గ సభ్యులు కాశెట్టి రాజేష్, మాజీ ఎంపీటీసీ కాళ్ల సత్తయ్య, లింగాల హరీష్, కుమ్మరి నవీన్, కడారి సంపత్, మోతె సత్తయ్య, సుముఖ్, కాంగ్రెస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యవర్గం

బీర్‌పూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్‌లోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ కార్యవర్గాన్ని ఆదివారం ట్రస్ట్ బోర్డు ప్రకటించింది. కమిటీ సభ్యులుగా చిర్నేని శ్రీనివాస్, యశోద రమేష్, గుమ్మడి రమే ష్, పూడూరి గంగమణి, చల్ల లక్ష్మణ్, దేవనపెల్లి జగన్మోహన్, చెక్కపెల్లి సత్తన్న, చల్ల లక్ష్మణ్, ఎనగంటి సతీష్, చెట్టుపల్లి సత్యనారాయణ, చెన్న గంగన్న, స్వామాట్, భీమనాతి లవన్, అల్లెపు సురేందర్ నాయక్‌ల ను ఎంపిక చేస్తూ శనివారం ట్రస్టబోర్డు ఉత్తర్వులు జారీ చేసింది.

ఎమ్మెల్యేను కలిసిన సభ్యులు

●జగిత్యాలఅర్బన్: బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీసభ్యులు ఆదివారం జగి త్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజ య్ కుమార్‌ను కలిశారు. మూ డు సంవత్సరాల పాటు కొన సాగే ఈ కమిటీ సభ్యులు తమ నియామకానికి సహకరిం చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ము ప్పాల రాంచంద్రరావు, కలు గూరి దామోదర్‌రావు, నక్కల రవీందర్ ఉన్నారు.





















అక్రమంగా కల్యాణలక్ష్మి లబ్ధి పొందిన మహిళపై కేసు

మంథని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అందించే కల్యాణలక్ష్మి స్కీంను అక్రమంగా పొందిన మంథనికి చెందిన పుట్ట పద్మపై తహసీల్దార్ కుమారస్వామి ఫిర్యాదు మేరకు మంథని పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 14న కేసు నమోదు చేసినట్లు హైకోర్టు న్యాయవాది, మాజీ ఉప సర్పంచ్ ఇనుముల సత్యనారాయణ ఆదివారం తెలిపారు. క్లాస్ వన్ కాంట్రాక్టర్, బీఆర్ఎస్ నేత పుట్ట ముఖేష్ కూతురు ప్రేమ వివాహం చేసుకోగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూతురు పేరిట కల్యాణలక్ష్మి స్కీంలో దరఖాస్తు చేశారు. రెవెన్యూ అధికారుల సహకారంతో తెల్ల రేషన్‌కార్డు, బీపీఎల్ కింద ఆదాయం సర్టిఫికెట్ పొంది ముఖేష్ భార్య పుట్ట పద్మ పేరిట రూ.1,00116 చెక్ జారీ అయిందని తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ ఆర్టీఐ యాక్టు ద్వారా ఆధారాలు సేకరించి ఆర్డీవో, జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణ జరిపి తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు ఆమెపై కేసు నమోదు చేసినట్లు మాజీ ఉపసర్పంచ్ తెలిపారు.

చికిత్స పొందుతూ జీపీ కార్మికుడి మృతి

తంగళ్లపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బస్వాపూర్‌కు చెందిన గ్రామపంచాయతీ కార్మికుడు భూమయ్య(52) చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. శనివారం రాత్రి జరిగిన ట్రాక్టర్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన భూమయ్యను సిరిసిల్ల ప్రధాన ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు.

స్వగ్రామానికి చేరిన గల్ఫ్ మృతదేహం

రామడుగు, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): రామడుగు మండలం గుండి గోపాల్‌రావుపేటకు ఎందిన అనగందుల ప్రకాశ్ అజ్మాన్ దుబాయ్‌లో గుండెపోటుతో మృతిచెందాడు. సమాచారాన్ని కుటుంబ సభ్యులు గ్రామానికి చెందిన పూడూరి మల్లేశంకు తెలియజేయడంతో అతను చిలుముల రమేష్, నెరుమట్ల బాబుస్వామికి తెలిపారు. ఈ సమాచారం దుబాయ్‌లో ఉంటున్న దుబాయ్ ఎల్లాల శ్రీనన్న సేవాసమితి ఉద్యోగులు రవి డేవిడ్‌కు తెలుపడంతో వెంటనే స్పందించి మృతుని వివరాలు తెలుసుకొని మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ చొరవ చొరవతీసుకున్నారు.

పనులకు గ్రహణం.. లోవోల్టేజీతో సతమతం

- మండలానికి 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు
- ఐదు నెలల క్రితం అగ్రిమెంట్ చేసుకున్న కాంట్రాక్టర్
- ఇంకా ప్రారంభం కాని పనులు

కథలాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో నెలకొన్న విద్యుత్ లోవోల్టేజీ సమస్య నుంచి విముక్తి కలిగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కథలాపూర్‌కు 220/132 కేవీ సామర్థ్యం గల విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మంజూరు చేసింది. జిల్లా కేంద్రం మినహా ఈ సామర్థ్యం ఉన్న సబ్‌స్టేషన్ ఎక్కడా లేదు. ఈ ప్రాంతంలో అధిక లోవోల్టేజ్ సమస్య ఉన్న కారణంగా మండల కేంద్రంతో పాటు ఇతర ప్రాంతాలకు సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేయాలని నిర్ణయించారు. సబ్‌స్టేషన్‌కు అవసరమైన సుమారు మూడెకరాల భూమి కూడా అందుబాటులో ఉండడంతో ఇక్కడే అనువైన ప్రదేశంగా అధికార యంత్రాంగం నిర్మాణానికి మొగ్గు చూపింది. ఇప్పటికే 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఇక్కడ ఉన్నప్పటికీ లోవోల్టేజీ సమస్య తీరడం లేదని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం మండలంలోని ఏడు గ్రామాల్లో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లకు 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచే గృహ, వ్యవసాయ, వ్యాపార, వాణిజ్య రంగాలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. అయినప్పటికీ వేసవిలో అధికంగా లోడ్ నమోదవుతోంది. ఈ నేపథ్యంలో 220/132 సబ్‌స్టేషన్ అవసరం కాగా అధికారుల అంచనా మేరకు ప్రభుత్వం రూ. 50 కోట్లతో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించి టెండర్ పిలిచారు. ఓ కాంట్రాక్టర్ ఈ పనులను దక్కించుకోగా గత మే నెలలో అగ్రిమెంట్ చేసుకున్నారు. ఐదు నెలలు గడుస్తున్నా పనులు ప్రారంభించక పోవడంపై ప్రజాప్రతినిధులు, ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేటాయించిన ఈ భూమి పూర్తిగా కుంటలో ఉండడంతో మొదట మొరం పనులు చేపట్టాల్సి ఉంది. రెండు నెలల కిందట నాలుగు ట్రిప్పుల మొరం వేసి నామమాత్రంగా వదిలేశారనే విమర్శలు వస్తున్నాయి. కాగా ఇప్పటికే జగిత్యాల, కోరుట్ల, రామగుండం నుంచి కథలాపూర్‌కు విద్యుత్‌ను తెచ్చుకుంటుండగా ఈ సబ్‌స్టేషన్ పూర్తయితే మెట్‌పల్లి మండలం గోధూర్ దాకా 80 టవర్లు ఏర్పాటు చేసి అక్కడికి మిగిలిన విద్యుత్‌ను సరఫరా చేయనున్నారు. 13 టవర్లు వరద కాలువపైన్ నుంచి వేసి కొత్తగా నిర్మించే సబ్‌స్టేషన్‌కు అనుసంధానం చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఈ విషయమై నిర్మాణ విభాగం ఏఈ కసిఫ్‌ను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా పనులు ప్రారంభించ దానికి ఏర్పాట్లు చేసు కుంటు న్నామన్నారు. టవర్లకు సంబం ధించిన సామగ్రి తెప్పిస్తున్నట్టు చెప్పారు.



సబ్‌స్టేషన్ కోసం కేటాయించిన స్థలం

రోడ్లపై ధాన్యం.. వాహనదారుల ఇబ్బందులు



సైదాపూర్-ములంగూర్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం

సైదాపూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ధాన్యం ఆరబోసేందుకు స్థలం లేకపోవడంతో రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోస్తున్నారు. దీంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడంతో రాత్రి వేళలో ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సాగునీరు అందడంతో ఎక్కడ ఖాళీ భూములు కనపడడం లేదు. సైదాపూర్ మండలంలో సుమారు 18వేల ఎకరాలలో వరి సాగు చేశారు. ఇప్పటికైనా కల్లాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కానిస్టేబుల్ హత్యపై నిరసన

మార్కండేయకాలనీ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నిజామాబాద్‌లో సీసీఎస్ కానిస్టేబుల్‌ను హత్య చేసిన రౌడీ షీటర్ రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేస్తూ వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఆదివారం నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నాయకులు మాట్లాడుతూ నిజామాబాద్‌లో క్రిమినల్, రౌడీషీటర్ అయిన రియాజ్‌ను విధి నిర్వహణలో ఉన్న ప్రమోద్ అనే కానిస్టేబుల్ అరెస్టు చేసి తీసుకెళుతుండగా పట్టపగలు దారుణంగా హత్య చేశాడని, దీన్ని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. కానిస్టేబుల్‌ను హత్య చేసిన రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు ఆయోధ్య రవీందర్, అడిగొప్పుల రాజు, ముష్కె సంపత్, మునిగాల సంపత్, కదురు గిరి, మ్యాడగోని రవీందర్, ములుకుంట్ల శ్రీనివాస్, రాజేష్ తదితరులున్నారు.

దుమ్మురేగుతున్న జాతీయ రహదారి

- పట్టించుకోని హైవే అథారిటీ



దుమ్ములోనే వెళ్తున్న వాహనాలు

శంకరపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో నిర్మాణ దశలో ఉన్న కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి వాహనాల రద్దీతో దుమ్మురేగుతోంది. కేశవపట్నం, ములంగూర్ శివారులో నిర్మాణ దశలో ఉన్న జాతీయ రహదారిని నీరు చల్లకపోవడంతో ఆదివారం దుమ్మురేగింది. భారీ వాహనాలు వెనకాల వెళ్లే ద్విచక్ర వాహనదారులు దుమ్ముతో ప్రమాదాల బారిన పడుతున్నారు. నిత్యం రహదారి గుండా ప్రయాణం జరిపే వాహనదారులతో పాటు సమీప గ్రామస్థులు అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిపై దుమ్ములేవకుండా నీరు చల్లించాలని వాహనదారులు కోరుతున్నారు.

ఖిల్లా సందర్శనకు వచ్చిన మహిళకు గాయాలు

శంకరపట్నం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలం ములంగూర్ ఖిల్లా సందర్శనకు వచ్చిన మహిళ ఖిల్లాపై ప్రమాదవశాత్తు జారిపడి గాయపడింది. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ మహిళ ములంగూర్ ఖిల్లా సందర్శనకు వచ్చారు. ఖిల్లాపైకి వెళ్లే క్రమంలో ప్రమాదవశాత్తు ఖిల్లాపై జారిపడడంతో కాలు విరిగింది. విషయం తెలుసుకున్న స్థానికులు 108కు సమాచారం ఇవ్వగా గాయపడిన మహిళను ఖిల్లా పైన స్ట్రేచర్‌పై అతి కష్టం మీద కిందకు తీసుకురావడానికి సుమారు 3గంటల సమయం పట్టింది. నదరు మహిళను 108 వాహనంలో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.



గాయపడ్డ మహిళ

ప్రమాదవశాత్తూ కిందపడి ఒకరి మృతి

ముత్తారం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓడేడు గ్రామానికి చెందిన కోలిపాక కుమారస్వామి(50) శనివారం రాత్రి ఇంటి ముందు ఉన్న డ్రైనేజీ వద్ద ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్రగాయాలు కాగా కుటుంబ సభ్యులు కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. కుమారస్వామి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

ఆటో, ఆర్టీసీ బస్సుఢీ : ముగ్గురికి గాయాలు

తిమ్మాపూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఇందిరానగర్ వద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం రాత్రి ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంపేట నుంచి కరీంనగర్ వైపు ప్రయాణికులతో వస్తున్న ఆటోను ఇందిరానగర్ శివారులో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వస్తున్న జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ బాలరాజుతో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న శివ, భూమేష్‌కు గాయాలైనాయి. గాయపడ్డ వారిని అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

హుజూరాబాద్ చేపల మార్కెట్‌లో మోసం

- తూకంపై నిలదీసిన ప్రజలు

హుజూరాబాద్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ మున్సిపాలిటీ సమీపంలోని చేపల మార్కెట్‌లో వ్యాపారులు వినియోగదారులను మోసం చేస్తున్నారు. ఆదివారం తూకంలో మోసాన్ని గుర్తించిన వినియోగదారులు చేపలు విక్రయించే వ్యాపారులను నిలదీశారు. తూకం వేసే బాట్లు రెండు రకాలుగా వ్యాపారులు వినియోగిస్తున్నారు. కిలో చేపలు తీసుకొని వేరే చోట తూకం వేస్తే 150 నుంచి 200 గ్రాములు తేడా వచ్చింది. ఈ విషయంపై చేపల వ్యాపారస్తులను నిలదీయగా, మళ్లీ తూకం వేసి అదనంగా కలిపి ఇచ్చారు. అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

చెరువు ఎఫ్‌టీఎల్ భూమిలో 'రియల్' వ్యాపారం

- రూ. 20 లక్షలకే ఐదు గుంటల భూమి ఇస్తామని ప్రచారం
- పోలీసుల రాకతో వ్యాపారుల పరుగులు

మల్యాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొండగట్టులో భూముల ధరలు చుక్కలు చూపిస్తుండగా కొందరు వ్యాపారులు చెరువులో గల ఎఫ్‌టీఎల్ భూమితో రియల్‌ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించారు. ఆకర్షణీయమైన అపర్ధతో ఎలాంటి అనుమతులు లేకుండానే చెరువులో గల భూమిని చదును చేసి ప్లాట్లుగా విభజించడమే కాకుండా అధిక రాబడి ఆశ చూపి వాటి విక్రయాలను చేపట్టారు. దీంతో కొందరు పోలీసులకు, గ్రామపంచాయతీ అధికారులకు సమాచారం అందించారు. మల్యాల మండలం ముత్యంపేట గ్రామ పరిధిలోని దిగువ కొండగట్టు సమీపంలోని తుమ్మచెరువులో గల ఆరు ఎకరాల వట్ట భూమిని కొనుగోలు చేసిన జగిత్యాలకు చెందిన కొందరు వ్యాపారులు పంచాయతీ లేఅవుట్‌కు సంబంధించిన అనుమతులు ఏమీ తీసుకోకుండానే ప్లాట్లుగా విభజించారు. ఆ భూమి ఎఫ్‌టీఎల్‌లో ఉండగా శ్రీ ఆంజనేయ ప్రకృతి పామ్‌ల్యాండ్ పేరిట బ్రోచర్లు ముద్రించి వ్యాపారులు చెరువులో చదును పనులు పూర్తి చేసినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం యాటీ ఇన్‌ఫ్రా గ్రూప్ పేరిట కస్టమర్లతో విందు భోజనం ఏర్పాటు చేశారు. పదుల సంఖ్యలో కస్టమర్లు అక్కడికి చేరుకున్నారు. రూ.20లక్షలకే ఐదు గుంటల భూమి అని, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయ్యాక కొన్ని సంవత్సరాలలోనే కొనుగోలు చేసిన డబ్బు తిరిగి ఇస్తామని ఆకర్షణీయమైన రాబడి పేరుతో ప్రచారం చేశారని తెలిసింది. ఆ అంగా కని పక్షంలో రోజుకి రెండు వేల చొప్పున అలాగే గంధపు చెట్టు నాటి ఐదేళ్ళ పూర్తి అయ్యాక దిగుబడి లాభంలో వాటా అని ప్రచారం చేయడంతో ఇక్కడకు వచ్చినట్లు కొందరు కస్టమర్లు తెలిపారు. దీంతో కొందరు పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు వస్తారని తెలిసింది. కాగా ఈ విషయమై కార్యదర్శి స్వప్నను వివరణ కోరగా పంచాయతీ అనుమతులు తాము ఇవ్వలేదని, చెరువులో లేఅవుట్‌పై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశామని కార్యదర్శి పేర్కొన్నారు.



చెరువులో చదును చేసిన భూమి

అదృశ్యమైన యువకుడి మృతదేహం లభ్యం

చందుర్తి అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి):చందుర్తి మండలం జోగాపూర్ గ్రామానికి చెందిన మట్టెల తిరుపతి (35) అనే యువకుడి మృతదేహం ఆదివారం సాయంత్రం లభ్యమైంది. గ్రామస్థుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మట్టెల దేవయ్య భాగ్యవ్వ కుమారుడు తిరుపతి మతిస్థిమితం లేక ఇంటి వద్దనే ఉంటున్నాడు. సెప్టెంబర్ 29న గ్రామంలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఇంటి నుంచి వెళ్లి అదృశ్యమయ్యాడు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు వెతికినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు. ఆదివారం సాయంత్రం కిష్టంపేట గ్రామ శివారులో పూడూరు బాపూరావు అనే రైతుకు చెందిన వ్యవసాయ బావిలో తిరుపతి మృతదేహాన్ని గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఈ సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

మస్కట్‌లో రాచర్ల గొల్లపల్లి వాసి మృతి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లి గ్రామానికి చెందిన యువకుడు ఆకుల శ్రీకాంత్(32) మస్కట్ దేశంలో అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందినట్లు స్థానికులు ఆదివారం రాత్రి తెలిపారు. ఆయన మృతి వార్త కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో గ్రామంలో పండుగ పూట విషాదం అలుముకుంది. గ్రామస్థుల కథనం మేరకు.. గ్రామంలోని ఆకుల రేణుక- అంజాగౌడ్ దంపతుల కొడుకు శ్రీకాంత్. స్థానిక కల్లు దుకాణంలో పనిచేస్తుండేవాడు. సరైన పనులు లేకపోవడం వల్ల హైదరాబాద్‌లో ప్రైవేటు సంస్థలో చేరి విధులు నిర్వహించాడు. చేతి నిండా పనులు లేక సుమారు రూ.3 లక్షల అప్పుల పాలయ్యాడు. దాంతో ఉపాధి కోసం నాలుగు నెలల కిందట మరో రూ.3 లక్షల బాకీలు చేసి మస్కట్ దేశానికి వలస వెళ్లాడు. గత రెండు నెలలుగా అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. చివరికి పరిస్థితి విషమించి చనిపోయాడు. కొడుకు చనిపోయాడనే వార్త తెలియడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా రోదిస్తున్నారు. కాగా భారత రాయబార కార్యాలయం, ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేలా చర్యలు తీసుకోవడంతో పాటు బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరారు.



శ్రీకాంత్(ఫైల్)

క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

జిల్లా ఖో-ఖో సంఘ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



క్రీడాకారులతో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఖో-ఖో క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని జిల్లా ఖో-ఖో అసోసియేషన్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాస్థాయి సీనియర్ మహిళలు, పురుషుల ఖో-ఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన సుడా చైర్మన్ క్రీడాకారులను పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, ఉన్నతస్థాయికి ఎదిగేందుకు అవకాశం ఏర్పడుతుందని అన్నారు. గతంలో జిల్లా క్రీడాకారులు విశేష ప్రతిభచాటి జిల్లా క్రీడా పతాకన్ని అంతర్జాతీయ స్థాయిలో రెపరెపలాడించారని, ముందుముందు మరింత మంది అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని అన్నారు. నిత్య శిక్షణతోనే క్రీడల్లో రాణించేదుకు అవకాశాలు ఉంటాయని అన్నారు. జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి వి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలిచేందుకు కృషి చేయాలన్నారు. ఖో-ఖో క్రీడలో కరీంనగర్‌కు మంచి పేరు ఉందని గుర్తుచేశారు. ఈ పోటీల్లో కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి 225 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి ఖో-ఖో క్రీడను నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే శిక్షణ శిబిరానికి 20 మంది మహిళలు, 20 మంది పురుషులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బాషబోయిన వేణుగోపాల్, జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు, సంఘ ఉపాధ్యక్షులు, కరీంనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కమాలస్వామి, కోశాధికారి దిల్లే తిరుపతిరెడ్డి, జగిత్యాల జిల్లా సంఘ ప్రతినిధి డాక్టర్ ఏ రవీందర్, సిరిసిల్ల జిల్లా సంఘ ప్రతినిధి ఎస్‌కే మోహినుద్దీన్, కరీంనగర్ జిల్లా సంఘ సభ్యులు వి సూర్యప్రకాష్, కట్ల సంతోష్, వి శ్రీలత, రేణుక, యోగేష్, కరుణాకర్, అశోక్, రాజబాబు, అంతర్జాతీయ ఖో-ఖో క్రీడాకారులు ప్రదయ ఆనంద్, వెంకటేశ్, రాజు, జలంధర్, కోచ్ ఇ నరేష్, వ్యాయామ ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు. పోటీల ముగింపు సమావేశానికి పెద్దపల్లి జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఎ సురేష్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు ఎ లక్ష్మణ్, మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల లెక్చరర్ టి రమేష్ హాజరయ్యారు.

బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఖజానా దోచుకున్నారు

- బలహీనవర్గాల మంత్రులపై హరీశ్‌రావు అవహేళన
- రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కరీంనగర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఖజానాను దోచుకోవటం, దాచుకోవటం తప్ప ప్రజల సంక్షేమం పట్టించుకోలేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ విమర్శించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సుడా చైర్మన్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డితో కలిసి ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ ఎలా కూలింది? కోట్ల రూపాయల అవినీతికి బాధ్యులు ఎవరు? కేసీఆర్ కుటుంబ సభ్యులారా కవిత ఆరోపణలపై మాజీ మంత్రి హరీశ్‌రావు ముందుగా సమాధానం చెప్పాలన్నారు. హరీశ్‌రావు 2003కు ముందు, 2023లో ఆస్తులు ఎంత అనేవి వెల్లడించాలన్నారు. రబ్బరు చెప్పులు వేసుకున్న హరీశ్‌రావు నేడు వేల కోట్ల ఆస్తులు సంపాదించారని పత్రికలో రాశారని అన్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో వ్యక్తిగత అంశాలను చర్చించారని, దండుపాళ్యం పాలన అంటూ హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలపై మంత్రి అడ్లూరి మండిపడ్డారు. సిద్దిపేట వెంకటేశ్వర స్వామి ఆలయానికి రాసున్న శనివారం తాను వస్తానని, తన తల్లిదండ్రులపై ప్రమాణం చేసి క్యాబినెట్‌లో జరిగిన ప్రతి అంశాన్ని స్వామి సాక్షిగా చెబుతానని మాజీ మంత్రి హరీశ్ రావుకు సవాలు విసిరారు. దళిత, బలహీనవర్గాల మంత్రులున్న క్యాబినెట్‌పై అవహేళన చేయడం తగదన్నారు. రాష్ట్ర క్యాబినెట్‌లో ప్రజా సంక్షేమం, విద్య, బీసీ రిజర్వేషన్లు, దళిత సంక్షేమం వంటి అంశాలపై లోతుగా చర్చ జరిగిందని మంత్రి తెలిపారు. నీతి, ధర్మం, న్యాయం ఉంటే సవాల్ స్వీకరించాలని, తెలంగాణ ప్రజలను తప్పుదారి పట్టించడం దారుణమన్నారు. సెరెళ్ల ఘటనపై కవిత చేసిన ఆరోపణలకు కూడా జవాబు చెప్పాలన్నారు. దళిత, బీసీ వర్గాల ఎదుగుదల మీకు ఇష్టం లేదా అని ప్రశ్నించారు. గతంలో ఉప ముఖ్యమంత్రి రాజయ్య, మంత్రి కొప్పుల ఈశ్వర్‌లను కూడా కేసీఆర్ అవమానించారన్నారు. కానీ ఈరోజు రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వం దళితులకు, బలహీన వర్గాలకు ప్రాధాన్యం ఇస్తోందని, ముఖ్యమంత్రి స్వయంగా తనను పక్కన కూర్చోబెట్టుకుని తన శాఖ సమస్యలను పరిష్కరిస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ, బీసీల రిజర్వేషన్లపై మా చిత్తశుద్ధి ఏమిటనేది ప్రజలకు తెలుసన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీ తీర్మానాల సమయంలో కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రాలేదని సమాధానం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాకు చెందిన నీటిని సిద్దిపేటకు మళ్లించడం ఏ న్యాయం? అని నిలదీశారు. హరీశ్‌రావు నోరు అదుపులో పెట్టుకోవాలని, ప్రజా ప్రతినిధిగా బాధ్యతగా మాట్లాడాలని హెచ్చరించారు. ప్రభుత్వానికి ఇంకా మూడేళ్ల సమయం ఉందని, ఇచ్చిన ప్రతి హామీ నెరవేర్చుతామన్నారు. సమావేశంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ కొరివి అరుణ్ కుమార్, మైనార్టీసెల్ ప్రెసిడెంట్ తాజుద్దీన్, దండి రవీందర్, చెర్ల పద్మ, సమద్ నవాబ్ ఉన్నారు.

గర్రెపల్లి, భూపతిపూర్ దుకాణాల్లో చోరీలు

సుల్తానాబాద్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్రెపల్లి, భూపతిపూర్ గ్రామాల పరిధిలోని రోడ్డు పక్కనున్న దుకాణాలలో ఆదివారం దొంగతనాలు జరిగాయి. గర్రెపల్లి స్టేజీ వద్ద ఉన్న శ్రీకృష్ణ జెర్సీ పాల దుకాణం, చాయ్ కొట్టు, అలాగే భూపతిపూర్ గ్రామశివారు లోని పెట్రోల్ బంక్ పక్కన ఉన్న టేలాలు, చికెన్ సెంటర్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీలకు పాల్పడ్డారు. ఈ షెట్టర్లను ఇనుపరాడ్ సహాయంతో తొలగించి దొంగతనానికి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. రోడ్డు పక్కనున్న పాల దుకాణంలో చోరీకి వచ్చిన వ్యక్తి ఆ షాపులో చేస్తున్న దొంగతనాల దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు అయ్యాయి. సీసీ కెమెరాల దృశ్యాల ఆధారంగా దొంగలను పట్టుకోవాలని బాధితులు కోరుతున్నారు. గర్రెపల్లి స్టేజీ ఏరియాలో రాత్రి పూట పోలీసులు పెట్రోలింగ్ చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. దొంగతనానికి సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సమాధుల వద్ద దీపావళి సంబరాలకు సిద్ధం



సమాధుల స్థలంలో పిచ్చి మొక్కలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

కరీంనగర్ కల్చరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కార్ఖానగడ్డ, సవరన్ స్ట్రీట్, ఆదర్శనగర్ శ్మశాన వాటికలు దీపావళి సంబరాలకు సిద్ధమయ్యాయి. 10 దశాబ్దాలుగా సమాధుల వద్ద దీపావళి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీపావళికి ఒకటి రెండు రోజుల ముందు నుంచే సమాధులకు రంగులు, సున్నాలు వేసి అలంకరించి దీపావళి నాడు సమాధుల వద్ద వారికిష్టమైన పదార్థాలు నైవేద్యంగా సమర్పిస్తారు. టపాసులు కాల్చి గతించిన వారి స్మృతిలో గడుపుతారు. ఎక్కడెక్కడో ఉన్న కుటుంబ సభ్యులంతా వ్యయ ప్రయాసలకోర్చి ఒకే చోట కలుసుకొని కష్ట సుఖాలు కలబోసుకొని పెద్దలను గుర్తు చేసుకుంటారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సమాధుల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు.



సమాధుల స్థలంలో తొలగిస్తున్న చెత్త

కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లపై చొరవ తీసుకోవాలి

● రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మంత్రి పొన్నంకు స్వాగతం పలుకుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల ఆకాంక్ష 42శాతం బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం, ప్రాతినిధ్యం వహిస్తున్న బీజేపీ, కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి, ఎంపీలు తెలంగాణ బిడ్డలుగా చొరవ తీసుకోవాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం సాయంత్రం వేములవాడలో శృంగేరి పీఠాధిపతి శ్రీవిధుశేఖర భారతిస్వామి ధర్మ విజయయాత్రలో పాల్గొనడానికి వెళ్తున్న పొన్నం ప్రభాకర్‌ను సిరిసిల్లలో కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ ఇచ్చిన బంద్ పిలుపునకు రాజకీయ పార్టీల మద్దతుతో పాటు ప్రజల భాగస్వామ్యంతో విజయవంతంగా జరిగిందన్నారు. ప్రజల ఆకాంక్ష, రాజకీయ పార్టీల ఏకాభిప్రాయాన్ని కేంద్ర ప్రభుత్వం గమనించాలన్నారు. 50 శాతం పరిమితి రాజ్యాంగంలో ఎక్కడా లేకున్నప్పటికీ న్యాయస్థానాల పేరుతో ఆపే ప్రయత్నం జరగకుండా గతంలో ఈడబ్ల్యూఎస్ 10 శాతం ఏ విధంగా ఇచ్చారో అదే పద్ధతిలో బీసీ రిజర్వేషన్లు ఇవ్వాలన్నారు. తెలంగాణలో ప్రామాణికంగా కుల గణనతో లెక్కలు తీయడం జరిగిందన్నారు. తమిళనాడులో వేరే పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ గతంలో పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షను గౌరవించినట్లు ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బీజేపీ 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని అన్నారు. దీనికి కేంద్ర మంత్రులు, ఎంపీలు చొరవ చూపాలన్నారు. బీసీల అభివృద్ధి కోసం కాంగ్రెస్ పార్టీ కృషి చేస్తుందన్నారు. పొన్నంను స్వాగతించిన వారిలో కాంగ్రెస్ నాయకులు చొప్పదండి ప్రకాష్, సంగీతం శ్రీనివాస్, గడ్డం నర్సయ్య, ఆకునూరు బాలరాజు, కత్తెర దేవదాస్, స్వరూపరెడ్డి, వనిత, చంద్రకళ, ఆడేపు ప్రభాకర్, దేవరాజు, గోనె ఎల్లప్ప, దేవయ్య , శ్రీనాథ్, మహేష్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.


దత్తాత్రేయ స్వామి ఆలయం

పర్యాటకంపై శీతకన్ను

● స్వామివారి నిత్య పూజలకు తప్పని ఇబ్బందులు

● ఎంపీ నిధులతో బోటు సమకూర్చినా స్పందించని వైనం

● బోటు ఆపరేటర్‌ను నియమించని ప్రభుత్వం



దత్తాత్రేయ స్వామి గుట్ట

బోయినపల్లి అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లి మండలం వరదవెల్లి సమీపంలోగల దత్తాత్రేయ స్వామి ఆలయంలో నిత్య పూజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దత్తాత్రేయ స్వామి గుట్ట చుట్టూ ప్రతి వర్షా కాలంలో మిడ్ మానేరు జలాలు పెరగడంతో గత ఏడాది కేంద్ర మంత్రి బండి సంజయ్ ఎంపీ నిధుల ద్వారా బోటును కొను గోలు ఇచ్చారు. అయితే ప్రయాణానికి పర్యాటక శాఖ అనుమతి రాకపోవడంతో బోటు ఆపరేటర్‌ను నియమించడం లేదు. దీంతో స్వామివారికి నిత్య పూ జలు చేయలేక పోవడంతో పాటు భక్తులకు సైతం దర్శన భాగ్యం కరువైంది. పలుమార్లు బోట్ సౌక ర్యానికి పర్యాటక శాఖ అధికారులకు ఆలయ కమిటీ ఆధ్వ ర్యంలో వినతి పత్రాలు ఇచ్చిన స్పందించడం లేదని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.



నిరుపయోగంగా ఉన్న బోటు

డిసెంబరులో స్వామివారి జయంతి ఉత్సవాలు...

శ్రీ దత్తాత్రేయ స్వామి ఆలయంలో ప్రతి ఏడాది డిసెంబరు మాసంలో జయంతి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. జయంతి ఉత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు వేలాది మంది భక్తులతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు సైతం వస్తుంటారు.



పర్యాటక శాఖ అధికారులు స్పందించాలి..

- ఆడెపు రాజు, ఆలయ కమిటీ సభ్యుడు..

స్వామివారికి నిత్య పూజలకు ఆటంకం తలెత్తింది. పర్యాటక శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి వెంటనే బోటు ఆపరేటర్‌ను నియమించి స్వామివారి దర్శన భాగ్యం భక్తులకు కల్పించాలి.

సమస్య పరిష్కారానికి కృషి...

- కుస రవిందర్, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు

పర్యాటక శాఖ నుంచి బోటు ఆపరేటర్ లేకపోవడంతో స్వామివారి నిత్య పూజలు లేకపోవడంతో భక్తులకు ఇబ్బందిగా మారింది. సమస్యను చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దృష్టికి తీసుకువెళ్లి ఆపరేటర్ నియామకానికి కృషి చేస్తా.



జగిత్యాలలో కొండ చిలువ



జగిత్యాలలో కనిపించిన కొండ చిలువ

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో శనివారం రాత్రి భారీ కొండ చిలువ కలకలం సృష్టించింది. పట్టణంలోని కరీంనగర్ రోడ్డులో గల పద్మనాయక కళ్యాణమండపం దుకాణాల సముదాయం వద్ద కొండ చిలువ ప్రత్యక్షం కావడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించడంతో వారు కొండ చిలువను పట్టుకుని అడవిలో వదిలి వేసినట్లు తెలిపారు.

మొబైల్ ఫోన్ అప్పగింత

తిమ్మాపూర్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన పిట్టల కుమార్ ఆరు నెలల క్రితం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. సిఐఈఆర్ పోర్టల్ ద్వారా ఎల్ఎండీ పోలీసులు పోయిన ఫోన్‌ను కనుగొన్నారు. ఆదివారం పిట్టల కుమార్‌కు ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై శ్రీకాంత్ గౌడ్ ఫోన్ అందజేశారు. ఎవరైనా మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నట్లయితే సిఐఈఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ సూచించారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఐదుగురి పట్టివేత

వీణవంక,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆదివారం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఐదుగురిని పట్టుకున్నట్లు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి కుటుంబ సభ్యులకు దూరమవుతారన్నారు. మద్యం తాగి వాహనం నడిపి పట్టుబడితే జైలు శిక్షతో పాటు జరిమానా పడే అవకాశం ఉందని తెలిపారు.

సామాజిక రుగ్మతలను రూపుమాపాలి

● జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్‌రావు

వేములవాడ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు జనవిజ్ఞాన వేదిక ప్రయత్నం చేస్తుందని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్‌రావు అన్నారు. వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా వార్షి సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక సైన్స్‌ను ప్రచారం చేస్తూ సామాజిక రుగ్మతలను తొలగించే ప్రయత్నం చేస్తుందని అన్నారు. విద్య, వైద్యంతో పాటు అనేక సామాజిక సమస్యలపై అహర్నిశలు పోరాడుతూ సామాన్య ప్రజానీకానికి సైన్స్ ఫలాలు అందాలని కోరుకుంటుందని అన్నారు. సైన్స్ పట్ల భారతదేశ కృషి ఆశించిన స్థాయిలో లేకపోవడం, ప్రపంచ దేశాల్లో నోబెల్ బహుమతి పొందడంలో మన దేశం చాలా వెనుకబడిపోయిందన్నారు. ఇంత వరకు భారతదేశం నుంచి నోబెల్ ప్రైజ్ పొందినవారు భారత సంతతికి చెందిన నలుగురు మాత్రమే ఉన్నారని తెలిపారు. సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రావుల వరప్రసాద్, జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి మహేందర్, అంజనేయులు, రామరాజు ఉన్నారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికలపై ఫోకస్

● చైర్మన్ పదవి 'చే'జిక్కించుకునేందుకు కసరత్తు

● బీజేపీ, బీఆర్ఎస్ నుంచి ప్యానల్స్ నిలిపే అవకాశం

● రేపటి నుంచి నామినేషన్లు షురూ



కరీంనగర్ టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ సహకార అర్బన్ బ్యాంకు పాలకవర్గ ఎన్నికలు రాజకీయ వేడిని పుట్టిస్తున్నాయి. ఎనిమిదేళ్ల తర్వాత నవంబరు 1న జరిగే పాలకవర్గ ఎన్నికలపై ప్రధాన పార్టీలు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టాయి. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు జరిగే ఈ ఎన్నికల్లో గెలిచి అదే ఊపును ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచు, వార్డు సభ్యుల ఎన్నికల్లో కూడా కొనసాగించేందుకు పార్టీలు వ్యూహ రచన చేస్తున్నాయి. రాజకీయాలకతీ తంగా అర్బన్ బ్యాంకు ఎన్నికలు నిర్వహిస్తున్నప్ప టికీ అన్ని పార్టీలు వారి ప్యానళ్లను ఏర్పాటు చేసి బ్యాంకును కైవసం చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నాయి.

- ప్రస్తుత పర్సన్ ఇన్‌చార్జి కమిటీ పదవీకాలం ఈ నెల 14న ముగిసింది. అర్బన్ బ్యాంకును కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నేతలు ఇప్పటికే ఎన్నికలకు సమాయత్తమవుతున్నారు. మాజీ పర్సన్ ఇన్‌చార్జి కమిటీ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, మాజీ ఇన్‌చార్జి చైర్మన్ కర్ర రాజశేఖర్ ఇద్దరు కాంగ్రెస్ నేతలే.. ఎవరికివారు ప్యానల్స్‌పై దృష్టి సారిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు పార్లమెంట్ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మాజీ డైరెక్టర్లు, కొంత మంది సీనియర్ నాయకులతో ప్యానల్‌ను ఏర్పాటు చేసి ఎన్నికల్లో నిలుపుతారనే ప్రచారం జరుగుతోంది.

- కేంద్ర హోం శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ అర్బన్ బ్యాంకు డైరెక్టర్ పదవితోనే రాజకీయాల్లో వచ్చారు. ఆయనకు బ్యాంకుపై పట్టు ఉంది. ఆయన డైరెక్టర్ అయిన రోజుల్లో చైర్మన్‌గా ఉన్న డి శంకర్ ప్రస్తుతం బీజేపీలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ ప్యానల్‌ను తయారు చేస్తే తప్పకుండా సంజయ్ నాయకత్వంలో బ్యాంకును కైవసం చేసుకోవచ్చని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అధ్యక్షతన అర్బన్ బ్యాంకు ఎన్నికలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. బ్యాంకు ఎన్నికల్లో పోటీ విషయమై చర్చించి కేంద్రమంత్రి బండి సంజయ్ అనుమతితో బరిలో నిలిపేందుకు నిర్ణయించినట్లు తెలిసింది.

- బ్యాంకు మాజీ చైర్మన్ కర్ర రాజశేఖర్ గతంలో బీఆర్ఎస్‌లో ఉండగా ఆయన చైర్మన్‌గా, మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పర్సన్ ఇన్‌చార్జి కమిటీని వేయించారు. ప్రస్తుతం రాజశేఖర్ బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వెళ్లగా మిగిలిన సభ్యులు ఈ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఉత్సాహంగా ఉన్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ కూడా అర్బన్ బ్యాంకు ఎన్నికలపై ఒకటి రెండు రోజుల్లో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్యానల్‌ను తయారు చేస్తారని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు.

మూడు ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు పోటీకి సిద్ధమవుతుండడంతో అర్బన్ బ్యాంకులో రాజకీయవేడి రాజుకుంటోంది. సోమవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎన్నికలకు 10 రోజుల వ్యవధి మాత్రమే ఉంది. దీపా వళి నుంచి ప్రచారాన్ని సాగించి విజయం సాధిం చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయం



భక్తులతో సందడిగా మారిన రాజన్న ఆలయం

వేములవాడ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్ర జ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయి కనిపించింది. ఆదివారం సెలవు రోజు కావడంతో రాజన్న దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ధర్మగుండం లో పవిత్రస్నానాలను ఆచరించారు. ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన భక్తులు శ్రీపార్వతిరాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని తరించారు. రాజన్నకు ఎంతో ప్రీతిపాత్రమైన కోడెమొక్కులు చెల్లించుకున్నారు. కార్తీక మాసం సమీపిస్తుండటంతో భక్తులు రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఈవో రమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఏర్పాట్లు పరిశీలించిన విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ రాజన్న ఆలయానికి శృంగేరి జగద్గురు శ్రీ విధుశేఖర భారతి స్వామి వారు వస్తున్న సందర్భంగా ఆలయంలో ఏర్పాట్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీస్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ఠచర్యలు తీసుకోవాలని ఆలయ ఉద్యోగులకు సూచించారు. స్వామి వారిని దర్శించుకున్నారు.

ధర్మపురిలో ధనలక్ష్మి పూజలు

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో గల అద్దాల మండపంలో ఆదివారం సాయంత్రం ధనలక్ష్మి పూజలు అత్యంత వైభవంగా ప్రారంభించారు. దీపావళి పర్వదినం పురస్కరించుకుని మండపం వద్ద లక్ష్మీదేవి చిత్రపటాన్ని ఉంచి ఆలయ వేదపండితులు పూజలు నిర్వహించారు. రాత్రి వరకు అనేక మంది భక్తులు దర్శనం చేసుకున్నారు. కార్యక్రమం లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.



ధర్మపురి ఆలయంలో ధనలక్ష్మి పూజలు

నరసింహుని సన్నిధిలో భక్తుల రద్దీ

ఆశ్వయుజ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక శ్రీలక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ ఉగ్ర నరసింహ, శ్రీ వేంకటేశ్వర, శ్రీ రామలింగేశ్వర స్వామి, గణపతి ఆలయాల్లో ఆలయ వేద పండితుల పూజలు చేశారు. భక్తులు స్వామివారలను దర్శనం చేసుకున్నారు.

కర్మను అనుసరించి ఫలితం ఉంటుంది

● ఈశ్వరుడి అనుగ్రహంతోనే అభివృద్ధి పనులు ● శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి



అనుగ్రహణభాషణం చేస్తున్న విధుశేఖర భారతి మహాస్వామి



రాజన్న ఆలయ మాస్టర్ ప్లాన్‌ను వీక్షిస్తున్న భారతి మహాస్వామి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మనిషి పాటించే కర్మలను అనుసరించి ఫలితం ఉంటుందని, మనం విషబీజం నాటితే విషపు ఫలాలే వస్తాయని, మంచి బీజం నాటితే మంచి ఫలాలు వస్తాయని శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి భక్తులకు సూచించారు. ధర్మ విజయయాత్రలో భాగంగా ఆదివారం రాత్రి వేములవాడ క్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయ ఓపెన్ స్లాబ్‌లో భక్తులకు అనుగ్రహణభాషణం చేశారు. వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రం ఎంతో పరమపవిత్రమైనదని, మహిమాన్వితమైన క్షేత్రంగా వర్ధిల్లుతుందని అన్నారు. పరమశివుడిని భక్తులు ఎంతో విశేషంగా, సర్వశ్రేష్ఠంగా ఎంతో నమ్మకంతో కొలుస్తారని అన్నారు. భక్తుల సౌకర్యార్థం, అభివృద్ధి కోసం శాస్త్రోక్త విధానాలతో సంపన్నం చేసేందుకు విశేషంగా అభివృద్ధి జరగాలని ఆకాంక్షించారు. పరమేశ్వర తత్వం అద్భుతమైనదని, ఈశ్వరుడ మంగళకారుడని, ప్రతి ఒక్కరి మంచికోరే తత్వమని తెలిపారు. మనం చేసే పనులతోనే మనం కర్మ ఫలాన్ని అనుభవిస్తామని అన్నారు. ఈశ్వరుడు సర్వాంతర్యామీ అని మంచి చెడులను అర్థం చేసుకునే సంకల్పం ఉండాలని సూచించారు.

ప్రణాళిక ప్రకారం రాజన్న ఆలయ అభివృద్ధి పనులు

- మంత్రి పొన్నం ప్రభాకర్

శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి మార్గదర్శనం మేరకు వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులు పక్కా ప్రణాళికతో చేపడుతామని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శ్రీ విధేశేఖర భారతి మహాస్వామి అనుగ్రహ భాషణం చేసేముందు పొన్నం మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యం రాజన్న ఆలయ అభివృద్ధి అని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిపై స్వామి వారు మార్గదర్శనం చేయాలని తమ సూచనలతో ముందుకు వెళతామని విజ్ఞప్తి చేశారు. ఆలయ అభివృద్ధిలో ఎలాంటి రాజకీయాలు లేదని స్పష్టం చేశారు.

శృంగేరి పీఠాధిపతుల సూచనలతోనే..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ విస్తరణ, అభివృద్ధి పనులు శృంగేరి పీఠాధితుల సలహాలు, సూచనల మేరకు ముందుకు సాగుతున్నామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శృంగేరి పీఠాధిపతి అనుగ్రహ భాషణంకు ముందు ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి కృషితో ఆలయాభివృద్ధికి ముందడుగు వేశామని అన్నారు.భక్తుల విశ్వాసాలు, అభిప్రాయాలు, పండితులు, ఇతర ప్రముఖుల సలహాలు, సూచనల మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. మొదటి దశలో రే. 76 కోట్లతో ప్రధాన ఆలయ విస్తరణ, అభివృద్ధి, రూ. 35 కోట్లతో అన్నదాన సత్రం, రూ. 47 కోట్లతో ప్రధాన రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. ఆయన వెంట ఆలయ పరిరక్షణ కమిటీ అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, ఆలయ ఈవో రమాదేవి తదితరులు ఉన్నారు.

పీఠాధిపతికి ఘన స్వాగతం

వేములవాడ కల్చరల్ : శృంగేరి పీఠాధిపతి విధుశేఖర భారతి మహాస్వామి ధర్మ విజయ యాత్రలో భాగంగా వేములవాడకు చేరుకున్నారు. ఆదివారం రాత్రి పట్టణంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ మహేష్ బి గీతె, అడిషనల్ ఎస్పీలు శేషాద్రినిరెడ్డి, చంద్రయ్యలు పూలమాలలు అందజేసి ఘనస్వాగతం పలికారు. భక్తులు భారీ గజమాల సమర్పించారు. మహిళలు హారతులు పట్టారు.

కొండగట్టులో అక్రమ వసూళ్లకు అడ్డుకట్ట

కొబ్బరి కాయలు కొట్టేందుకు డబ్బులు వసూలు చేస్తున్న సిబ్బంది తొలగింపు



కొబ్బరికాయ కొడుతున్న భక్తులు

మల్యాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి సన్నిధానంలో భక్తులు స్వామి వారి దర్శనం అనంతరం చెల్లించుకునే కొబ్బరి మొక్కుల వద్ద భక్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారే ఫిర్యాదులపై దేవస్థానం అధికారులు స్పందించారు. కొబ్బరి కాయలు కొట్టె చోట ముక్కల సేకరణ సిబ్బందిని తొలగించారు. దీంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొబ్బరి ముక్కల సేకరణ కాంట్రాక్టర్ కొబ్బరి ముక్కలను సేకరించుకోవాల్సి ఉంటుండగా సేకరణ సమయంలో సిబ్బంది ఒక్కో కొబ్బరికాయ కొట్టడానికి సగం ముక్క తీసుకుంటూనే రూ.10వరకు వసూలు చేయడంపై కొన్నేళ్లుగా భక్తులు దేవస్థానం అధికారుల దృష్టికి తీసుకెలుతూనే ఉన్నారు. వీహెచ్‌పీ, భజరంగ్‌దల్ తదితర హిందూ సంస్థలు కూడా పలు మార్లు డబ్బులు వసూలు చేసే సిబ్బందిని పట్టుకొని అధికారులకు అప్పగించారు. అయినప్పటికీ వసూల్లు ఆగకపోవడంపై అనేక అనుమానాలకు తావునిచ్చింది. దీంతో ఇటీవల అధికారులు సిబ్బందిని అక్కడి నుంచి తొలగించడమూ కాకుండా డబ్బులు చెల్లించకూడదనే బోర్డు ఏర్పాటు చేశారు. దీంతో సాఫీగా భక్తులు స్వామి వారికి కొబ్బరి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

‘నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం’


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్/రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. అధికార పార్టీతో ప్రతిపక్షాలు కలిసి పనిచేయడం కొత్తకాదని, స్వార్థంతో కొందరు అనవసరపు రాద్ధాంతం చేస్తున్నారని ఆయన అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలోని మోతే పార్టీ కార్యాలయంలో ముఖ్య మంత్రి సహాయ నిధిద్వారా మంజూరు అయిన 15 లక్షల రూపాయలను 60మంది లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ అబివృద్ది కోసం అధికార పార్టీతో కలిసి పని చేస్తే ఎలాంటి తప్పు లేదని అన్నారు. అనవసరంగా కొందరు రాద్ధాంతం చేస్తున్నారని, వారి స్వలాభం కోసం పార్టీలు మారితే తప్పు లేదా అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి సహకారంతో జగిత్యాల నియోజక వర్గానికి అత్యధిక నిధులు తీసుకు వచ్చానని జగిత్యాల ను మరింత అబివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. జగిత్యాల నియోజక వర్గంలో విద్యా వైద్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా అత్యధిక పల్లె దవాఖానాలను జగిత్యాల నియోజక వర్గంలో ఏర్పాటు చేశామన్నారు. జాబితాపూర్ గ్రామంలో అతిపెద్ద గోదాం నిర్మాణం జరుగుతున్నదని, దానివల్ల స్థానికులకు ఉపాధి లభిస్తుందని అన్నారు. నియోజక వర్గంలో అర్హులందరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. తాను ప్రజలకు సేవ చేయడానికి రాజకీయాలలోకి వచ్చానని, రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ కొలుగూరి దామోదర్‌రావు, నాయకులు సురేందర్‌రావు, బాలముకుందం, నక్కల రవీందర్‌రెడ్డి, గడ్డం నారాయణరెడ్డి, ములాసపు మహేష్, గంగాధర్, నరేష్, తిరుపతి, సతీష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

‘అభివృద్ధికి నోచుకోని దళిత కాలనీలు’


దళిత వార్డును పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

రాయికల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజాపాలనలో దళిత వార్డులు అభివృద్ధికి నోచుకోలేదని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. ఆదివారం రాయికల్ పట్టణంలోని 3వ వార్డులో నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తొలి జడ్పీ చైర్ పర్సన్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో దళిత వార్డుల అభివృద్ధికి ఒక రూపాయి కూడా వ్యయం చేయలేదన్నారు. కేసీఆర్ హయాంలో వచ్చిన నిధులతో ఇప్పటికీ అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. అభివృద్ది కోసం పార్టీ మారిన వారు, ప్రజాపాలన అని చెప్పుకుంటున్న వారు దళిత వార్డులను అభివృద్ధి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ తరుపున కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారంపెల్లి రాణి, కోఆర్డీనేటర్ శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బర్కం మల్లేశం, మాజీ కౌన్సిలర్లు సాయి, సత్యనారాయణ, నాయకులు వినోద్, రాంప్రసాద్, రవితేజ, వంశీ ఉన్నారు.

‘విద్యార్థులు క్రీడల్లో రాణించాలి’


విజేతలకు బహుమతిని అందిస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

కొడిమ్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు విద్యతో పాటుగా క్రీడల్లో రాణించాలని చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన స్వర్గీయ మెన్నేని ప్రేమలతమురళీధర్‌రావు స్మారక కేపీఎల్ 2క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు ఎమ్మెల్యే బహుమతులను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రీడాకారులతో మాట్లాడుతూ క్రీడలు శారీరక ధృడత్వానికి దోహదపడుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనటం వలన స్నేహ సంబందాలు పెంపొందుతాయన్నారు. క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. యువత మద్యానికి, డ్రగ్స్ దూరంగా ఉండాలని కోరారు. క్రీడాకారులకు నిరంతరం అందుబాటులో ఉండి సహకారం అందిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్రికెట్ విజేతలకు రాయల్ సూపర్ కింగ్స్ గోల్కొండ రాజు టీంకు ప్రథమ బహుమతి 22,222 రూపాయలు, మెమొంటో, పిడుగు అనిల్‌రెడ్డి టీంకు 11,111 రూపాయలు, మెమొంటో, తృతీయ బీఆర్‌ఎస్ కేసీఆర్ గడ్డం లక్ష్మారెడ్డి టీంకు 5555రూపాయలు మెమొంటో, నాలుగవ బహుమతి ఛత్రపతి శివాజీ వారియర్స్ 3333రూపాయలు మెమొంటోలను అందించారు. ప్రైజ్ మనీ, కప్పులను కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్ మెన్నేని రాజనర్సింగరావు, చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం సమకూర్చారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నారాయణగౌడ్, కొడిమ్యాల సింగిల్‌విండో చైర్మన్ రాజనర్సింగరావు, కేంద్ర సహకార బ్యాంక్ మాజీ డైరెక్టర్ మల్లిఖార్జున్‌రెడ్డి, చొప్పదండి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేష్, మల్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి, మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల క్రికెట్ క్లబ్ సభ్యులు మోహనాచారి, లక్ష్మన్, డేవిడ్‌సన్, సురేందర్‌రెడ్డి, రాకేష్ పాల్గొన్నారు.

వైద్యుడికి సన్మానం

రాయికల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలోని ప్రగతి పాఠశాలలో ఆదివారం ప్రముఖ శస్త్ర చికిత్స నిపుణుడు గట్టు నరేష్ 300 మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలను తక్కువ కాలంలో విజయవంతంగా పూర్తి చేసినందుకు 2002 సంవత్సరంలో పదవ తరగతి చదివిన మిత్రులు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బాలె శేఖర్, వైద్యుడు నరేష్ నైపుణ్యం గురించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో 2002 పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రియాజ్‌ను ఎన్‌కౌంటర్ చేయాలి

మెట్‌పల్లిటౌన్,అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌ను అత్యంత రాక్షసంగా పొడిచి చంపిన హంతకుడు రియాజ్‌ను వెంటనే ఎన్‌కౌంటర్ చేయాలని బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోరుట్ల రాజ్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో పోలీస్‌ల ప్రాణలకే రక్షణ కరువైన దుస్థితి తెలంగాణ రాష్ట్రంలో నెలకొనడం తీవ్ర విచారకరం అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిందితుడిని పట్టుకోని ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు.

డయాబెటిస్ నిర్ధారణ పరీక్షలు

కోరుట్ల, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అరుణోదయ కళాశాలలో ఆదివారం కోరుట్ల లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో ఉచిత డయాబెటిస్ రక్త పరీక్ష శిబిరానికి నిర్వహించంగా విశేష స్పందన లభించింది. లయన్స్ క్లబ్ సభ్యుల అద్వర్యంలో పట్టణానికి చెందిన పలు ల్యాబ్ టెక్నీషన్స్ సహకారంతో ఉచిత రక్త పరీక్షలను నిర్వహించారు. 132 మందికి రెండు రకాల పరీక్షలను నిర్వహించి డయాబెటిస్ ఉన్నవారు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు కోమ్ముల జీవన్ రెడ్డి, దనుంజయ్, రమేష్, నల్ల గంగాధర్, పిడుగు గుణాకర్, గుంటుక సురేష్ బాబు, పోల రఘు, అడెపు వెంకటేశ్వర్లు, పోతని నవీన్, సత్యనారాయణ, భూషన్‌లతో పాటు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చేతి పంపులకు మరమ్మతు

బీర్‌పూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలోని లంబాడి తండాలో రెండు చేతి పంపులు చెడిపోవడంతో మాజీ సర్పంచ్ శిల్పా రమేష్, వార్డు సభ్యులు సైండ్ల శ్రీనివాస్‌లు కలిసి ఆదివారం మరమ్మతు చేయించారు. నీటి సమస్య తీర్చిన మాజీ సర్పంచ్ శిల్ప రమేష్‌కు, వాడు సభ్యులు శ్రీనివాస్‌కు తండా వాసు కృజ్ఞతలు తెలిపారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మల్లాపూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుట్ల నియోజకవర్గం ఇంచార్జి నర్సింగరావు సూచించారు. ఆదివారం మల్లాపూర్ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాంను ఆయన ఏఎంసీ చైర్మన్ పుష్పలతతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ పాలకవర్గం రాజేందర్, వాసురామ్‌నాయక్, నూతిపల్లి రాజమ్ పాల్గొన్నారు.

ధర్మపురి వాసికి డాక్టరేట్

ధర్మపురి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన రాచకొండ శ్రీనివాస్ అనే వృక్ష శాస్త్ర సహాయ ఆచార్యుడికి డాక్టరేట్ లభించింది. రాచకొండ శ్రీనివాస్ ప్రస్తుతం కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్ష శాస్త్ర సహాయ ఆచార్యులుగా పనిచేస్తున్నారు. ఉస్మానియా విశ్వ విద్యాలయానికి చెందిన బోటనీ ప్రొఫెసర్ యన్ లక్ష్మిభవాని పర్యవేక్షణలో ఆయన పరిశోధనలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం

బీర్‌పూర్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం లోని మంగేళ గ్రామంలో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత వైద్యశిబిరంలో 191 మంది పెద్దలకు 62 మంది చిన్నారులకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ ఫిజీషియన్ డాక్టర్ ఆకుతోట శ్రీనివస్ రెడ్డి, దంత వైద్య నిపుణులు డాక్టర్ ఇనుగూర్తి రాజశేఖర్, చెవి ముక్కు గొంతు నిపుణులు డాక్టర్ వడ్లూరి శ్రావణ్ కుమార్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ వడెపల్లి సాయి కిరణ్, మహిళా వైద్య నిపుణులు డాక్టర్ నివేదిత, కంటి వైద్య నిపుణురాలు డాక్టర్ మృదుల రెడ్డి, డాక్టర్ రేగుంట ప్రశాంత్, మంగేళ మాజీ సర్పంచ్ చుంచు శారధ నరేంధర్, మాజీ ఎంపీటీసీ లక్ష్మన్ రావ్, గురునాథం నరేష్, అశోక్, దుంపెట మల్లేశం పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

కొడిమ్యాల, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని వాగు ఒడ్డున ఉన్న పురాతన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం హన్మాన్ సేవా సమితి ఆధ్వర్యంలో గ్రామస్థులకు అన్నదానం నిర్వహించారు. అంతకుముందు ఆల యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి భాస్కర్, శ్రీదుర్గాదేవి సమితి సభ్యులు, హన్మాన్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థులు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన తాటిపల్లి గురుకుల విద్యార్థులు

మల్యాల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఖోఖో అసోషియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లా సీనియర్ ఖోఖో పోటీలలో మండలంలోని తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎస్.రేవతి, సిహెచ్.సంజన, రణవి, జాస్మిక, సంజన రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు ప్రిన్సిపాల్ మానస, పీఈటీ మదులిక తెలిపారు. విద్యార్థులను గురుకుల పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

దేవాదాయశాఖలో పదోన్నతులకు కృషిచేయాలి

మల్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవాదాయశాఖలో పదోన్నతులు, బదిలీలకోసం కృషిచేయాలని రాష్ట్ర టీఎన్‌జీఓల సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను మేజర్ టెంపుల్ ఎంప్లాయిస్ జేఏసీ రాష్ట్ర కో చైర్మన్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ కోరారు. కరీంనగర్ జిల్లా కేంద్రంకు వచ్చిన టీఎన్‌జీఓ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌ను మేజర్ టెంపుల్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ ఉపాధ్యాయుల చంద్రశేఖర్ ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి కొండగట్టు అంజన్న ప్రసాదాన్ని జగదీశ్వర్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో కరీంనగర్‌జిల్లా టీఎన్‌జీఓ అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర టీఎన్‌జీఓ ఉపాధ్యక్షుడు రాగి శ్రీనివాస్ లు పాల్గొన్నారు.

పాఠశాల గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల గదుల నిర్మాణానికి నిధులు మంజూర్ చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కాంగ్రెస్ నాయకులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందంతో కలిసి శనివారం ధర్మపురిలో కలిశారు. పాఠశాల భవనం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. స్పందించిన మంత్రివర్యులు 22న జరిగే మంత్రివర్గ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

బస్టాండ్ ప్రారంభం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చింతలపేట గ్రామానికి చెందిన సోగల రమేష్ తన తండ్రి సోగల రాజాం స్మారకార్థంగా గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద బస్టాండ్ ఏర్పాటు చేయించారు. ఆదివారం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ గోపిడి ముత్యంరెడ్డి, గోపిడి అనంతరెడ్డి, తోట్ల చిన్నయ్య, బొత్కూరి లింగారెడ్డి, టెలల రాజరెడ్డిలు ప్రారంభించారు.

శ్రీనివాసుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించే శ్రీనివాస్ నామధేయుల ఆత్మీయ సమేళనం విజయవంతం చేయాలని శ్రీనివాసుల నామధేయులు కోరారు. ఆదివారం కోరుట్ల పట్టణంలోని వీరబ్రహేంద్ర స్వామి దేవాలయ పాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

అంబేద్కరిజం ద్వారానే బలహీన వర్గాలకు గుర్తింపు


నినాదాలు చేస్తున్న నాయకులు

జగిత్యాల అర్బన్, అక్టోబర్ 19 (ఆంధ్రజ్యోతి): దేశంలో దశాబ్ద కాలంగా పెరిగిన కులతత్వం విధానాల నేపథ్యంలో బలహీన వర్గాలైన ఎస్టీ. ఎస్సీలకు అంబేద్కరిజం ద్వారానే గుర్తింపు లభిస్తున్నదని అంబేద్కర్ యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మగ్గిడి నర్సయ్య అన్నారు. ఆదివారం జగిత్యాల పట్టణంలో ఆదివారం అంబేద్కర్ స్మరణం కార్యక్రమంలో బాగంగా తహసీల్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులాలు, కులతత్వం అంతరించే వరకు అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కాపాడబడి అమల్లో ఉండాలని ఆకాంక్షించారు. దేశంలో ఎంతటి ఉన్నత పదవిలో ఉన్న మన గుర్తింపు అంబేద్కర్ వాదమేనని అన్నారు. సమాజంలో బీసీ, ఎస్టీ, ఎస్సీలు అట్టడుగు స్థానంలో ఉన్నారు. వీరికి రాజ్యాంగం కల్పించిన హక్కుల ద్వారానే స్వేచ్ఛా, స్వాతంత్య్రం పొందుతున్నారని అన్నారు. రాజ్యాంగం మార్చితే పురాతన రోజులు వస్తామని అందుకే బడుగు, బలహీన వర్గాలు ఐక్యంగా ఉండాలని సూచించారు. అంతకు ముందు కార్యక్రమ నిర్వాహకులు డిక్కీ కో ఆర్డినేటర్ నల్ల శ్యాం మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను, ఆలోచనలను భావి తరాలు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాకుమల్ల లక్ష్మీనారాయణ, కాంగుల వసంతరావు, బోనాల రత్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు దీపావళి వేడుకలు

రాయికల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) : రాయికల్ పట్టణంలోని విశ్వశాంతి పాఠశాలలో ఆదివారం ఉపాధ్యాయులు, విద్యార్థులు ముందస్తు దీపావళి వేడుకలను బాణా సంచా కాలుస్తూ ఘనంగా నిర్వహించారు.

పాఠశాల ఆవరణలో ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ ఆద్వర్యంలో లక్ష్మీదేవి పూజను నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేసారు. ఈ యకార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లులలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు మహేష్, అస్రర్, షారు, రంజిత్, మమత, సాయి, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : గుండె పోటుతో మృతి చెందిన మెకానిక్ సిరికొండ బాల రాజు కుటుంబంకు ఆదివారం కోరుట్ల మెకానిక్ సంఘ, తెలంగాణ టూ వీలర్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ ఆద్వర్యంలో ఆర్థిక సహాయంను అందజేశారు. కోరుట్ల మెకానిక్ సంఘ అద్వర్యంలో రూ.50,000, తెలంగాణ టూ వీలర్ అసోసియేషన్ అద్వర్యంలో 20,000 అందించినట్లు సంఘ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెకానిక్ సంఘ సభ్యులు తోడేటి బాబు, మానం రాంప్రసాద్, అడెపు శంకర్, గోవర్ధన్, ముజిమ్మిల్, సాబీర్, అల్లె రమేష్, వడ్లకొండ రమేష్, అంజయ్య, అర్మూర్ రాజగోపాల్, రియాజ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యం

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి) : పల్లెల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని పార్టీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు అన్నారు. మండలంలోని వేంపేట పెద్దమ్మ చౌరస్తా, చింతలపేటా గ్రామ చౌరస్తాలో నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అర్వింద్ మంజూరు చేసిన నిధులతో నూతనంగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కొమ్ముల రాజుపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి పీసు రాజేందర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నలిమెల నర్సింహరెడ్డి, ప్రధాన కార్యదర్శి జంగిటి శ్రీధర్, మారు జనార్ధన్‌రెడ్డి, మహేష్‌యాదవ్, గాజంగి రామస్వామి, గంట రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) 19 : ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ఆద్వర్యంలో ఏర్పాటు చేస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కూన గోవర్ధన్, కోరుట్ల నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఆదివారం మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని విశాల సహకార సంఘం చైర్మన్ కొమిరెడ్డి తిరుపతిరెడ్డితో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు విక్రయించి లాభలను పొందాలన్నారు. ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రా లలో ఎలాంటి అవకతవకలు లేకుండా, దళారులకు అవకాశం లేకుండా రైతుకు న్యాయం జరిగాలే అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ఆకుల లింగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ తిప్పిరెడ్డి అంజిరెడ్డి, డైరెక్టర్ పల్లి శేఖర్‌గౌడ్, కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖకు కిక్కు

(ఐదో పేజీ తరువాయి)

నిర్వహించే షాపుకు అత్యధికంగా 60 దరఖాస్తులు వచ్చాయి. అదేవిధంగా జిల్లాలోని సారంగపూర్-పెంబట్ల మద్యం దుకాణానికి అత్యల్పంగా 11 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ వర్గాలు వెల్లడించాయి.

● 27న మద్యం షాపులకు డ్రా

రాష్ట్రంలో బీసీ బంద్ చోటుచేసుకోవడం, పలు సెలవులు రావడం తదితర కారణాల వల్ల దరఖాస్తు దారుల విజ్ఞప్తిమేరకు మద్యం టెండర్ల స్వీకరణ గడువును 23వ తేదీ వరకు పొడిగిస్తూ ఎక్సైజ్ కమిషనర్ హరికిరణ్ ఉత్తర్వులు జారీ చేశారు. 27వ తేదీన కలెక్టర్ల సమక్షంలో మద్యం షాపులకు డ్రా తీయనున్నట్లు ప్రకటించారు. అనంతరం షాపులు దక్కించుకున్న వ్యాపారులు 1/6వ శాతం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. యేడాది 3 స్లాబుల్లో ఫీజు చెల్లించాలి. జిల్లాలో రూ.65 లక్షలు, రూ.55 లక్షలు, రూ.50 లక్షల స్లాబులుగా ఫీజు నిర్ణయించారు.

జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా మురళి


నూతన కార్యవర్గంతో డీఆర్‌డీవో రఘువరన్, ఆర్డీవో శ్రీనివాస్

జగిత్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడిగా ఇప్పనపల్లి మురళీ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్ల ఆదేశాల మేరకు ఎన్నికల అధికారి బింగి చిరంజీవి, సహాయ ఎన్నికల అధికారి సంగెం శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా అల్లె రాజేందర్, అసోసియేట్ అధ్యక్షులుగా గూడూరి శ్రవణ్, గాలిపెల్లి ఆనంద్, కోశాధికారిగా గురుడు శ్రీకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అనంతరం తొలి కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించగా డీఆర్‌డీఓ రఘువరన్, మెట్‌పల్లి ఆర్‌డీఓ నక్క శ్రీనివాస్, ఇరిగేషన్ ఎస్ఈ మిట్టపల్లి రమేశ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికయిన కార్యవర్గాన్ని శాలువలతో సన్మానించి అభినందించారు.

ధ్వజస్తంభ పునః ప్రతిష్ఠ కరపత్రాల ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నంబి వేణుగోపాల చారి

జగిత్యాల, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో గల గుట్ట రాజేశ్వర స్వామి దేవస్థానంలో అన్నపూర్ణా దేవి, నంది ధ్వజ స్తంభ పునః ప్రతిష్ట కరపత్రాలను ఆదివారం జగిత్యాలలో పలువురు నేతలు ఆవిష్కరించారు. గుట్ట రాజేశ్వర స్వామి దేవాలయంలో కార్తీక శుద్ధ ఏకాదశి నవంబరు 1వ తేదీ నుంచి 3వ తేదీ కార్తీక శుద్ధ త్రయోదశి వరకు జరిగే కార్యక్రమాల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్తీక దీపోత్సవం, త్రయాహ్నిక 108 జంటలచే లక్ష బిల్వార్చన, సాముహిక ఉమా మహేశ్వర వ్రత మహోత్సవ కార్యక్రమం ఆహ్వానం కరపత్రాలను నంబి వేణుగోపాల చారి కౌశిక, ఆలయ అర్చకులు గుంటిమరం జగదీశ్వర్ ఇతరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నంబి వేణుగోపాల చారి కౌషిక మాట్లాడుతూ అతి పురాతనమైన గుట్ట రాజేశ్వర స్వామి దేవాలయంలో ప్రతిష్ట కార్యక్రమానికి భగవత్ బంధువులు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అనువంశీయ ధర్మకర్తలు నరేందుల అమర్, పల్లెర్ల శంకర్రావు, కొత్తపెల్లి శ్రీనివాస్, పూటూరి శ్రీలత లక్ష్మీ నరసింహా రావు, పూటూరి భాస్కర్, ప్రసాద్, వేణుగోపాల్, పాంపాటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

1998-99 ఎస్సెస్సీ మిత్ర బృందం ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న ఎస్సెస్సీ మిత్ర బృందం

ధర్మపురి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని అమ్మ గార్డెన్స్‌లో 1998-99 ఎస్సెస్సీ మిత్ర బృందం సభ్యులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 1998-99 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు ఒకే చోట కలిసి తమ బాల్య జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అలాగే ఇప్పటికే పట్టణంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించిన మిత్ర బృందం భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మిత్ర బృందం అధ్యక్షులుగా తాళ్లపల్లి సురేందర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా బుక శ్రీనివాస్, ఎండీ షబ్బీర్, ప్రధాన కార్యదర్శిగా సంగెం సురేష్‌ను ఎన్నుకున్నారు. అలాగే కోశాధికారిగా సాదు సంతోష్, సలహాదారులుగా గంగాదరి మహేష్, చల్ల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరి కిరణ్‌కుమార్, గౌరవ అధ్యక్షులు మ్యాన పవన్‌కుమార్, మిత్ర బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులు సమ్మేళనం


రాయికల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

రాయికల్, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : రాయికల్ పట్టణంలోని ప్రగతి పాఠశాలలో 1999-2000 సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ ఉత్సవాల రూంలో ఆదివారం సమావేశమైనారు. 25 సంవత్సరాల తర్వాత ఉపాధ్యాయులు, విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవటంతో శివాజీ గార్డెన్ ప్రాంతం ఆనందోత్సాహాలతో నిండింది. పూర్వ విద్యార్థులు తమ జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవి, ఖదీర్, చంద్రశేఖర్, సత్యం, ఆజం, రవీందర్, రాజేశం, భూమయ్య, రాజన్న పూర్వ విద్యార్థులు సాయికృష్ణ ప్రణీత్, మహేష్, రంజిత్, వేణు తదితరులు ఉన్నారు.